కథ

# అమరవీరుడు

హిందీ మూలం: దిబేన్
అనువాదం: నలిమెల భాస్కర్



**అక్కడ చాలామంది గుమికూడారు. ప్రభుత్వాధికారులు సఫారీ డ్రెస్సుల్లో వున్నారు. గంజితోనూ, ఇస్త్రీతోనూ 'కడక్'మంటున్న తెల్లని దుస్తుల్లో రాజకీయ నాయకులు వెలిగిపోతున్నారు. అతని ఇంటి ముందు ఎర్రని లైట్లతో తెలుపు రంగు కార్లు బారులు తీరివున్నాయి.**

జనసందోహం అతణ్ణి చుట్టుముట్టింది. అతనికి అంతా వింతగా వుంది. జనం అతనితో "మీ కొడుకు దేవుని దగ్గరకు వెళ్ళాడు. అమరవీరుడు నక్షత్రాల్లో నక్షత్రంగా మారిపోయాడు. అతనికతనే సాటి. వీరుడు దైవంతో సమానం... వీరునికి మరణంలేదు" అంటున్నారు. అలా మాట్లాడేవాళ్ళతో ఎలా సమాధానం చెప్పాలో, ఏరకంగా మాట్లాడాలో అతనికేమీ తోచడంలేదు. తన కొడుకు శవపేటికలో బంధించబడి ఇంటి ముంగిట్లో పడివున్నాడు. సైనికులు ఆ స్థలాన్ని దిగ్బంధనం చేశారు. శవంతోపాటు వచ్చిన ఓ సైనికాధికారి పత్రికల వాళ్ళతో "హి వాజ్ రియల్లీ ఎ బ్రేవ్ బాయ్" అంటున్నాడు.

ఆ మాటలు విని అతని రొమ్ము గర్వంతో మరింత విశాలమైంది. తన కొడుకు అతి సాహసవీరుడు. కదనరంగంలో కొదమసింగం. వాడికి సాహసం ఉన్న మాట నిజమే...

** ** **

చిన్నప్పటినుంచీ తన కొడుకు ప్రతి పనిలోనూ తెగువ చూపించాలని మహా ఉబలాటపడేవాడు. ఒరోజు... వీధిలో ఎదురుపడ్డవాళ్ళనల్లా కొమ్ములతో కుమ్ముతూ నానా యాగీ చేస్తోన్న పోట్లగిత్త తోకను దొరకబుచ్చుకుని పరుగులు తీయించాడు. ఆ తర్వాత దాని మూపుమీద ఎక్కి చెవులు మెలేశాడు. అది రొప్పుతూ రోజుతూ నేలమీద కూలబడిపోయింది. ఈ విషయం అతనికి తెలిసి "ఒకవేళ నీకేమైనా అవుతే ఎలా వుండేదిరా?" అంటూ కొడుకుని మందలించాడు.

ఈ సంఘటన జరిగాక అతను లోపల్లోపల వాడు ఏ సాహసకృత్యం చేసి ప్రాణమ్మీదికి తెచ్చుకుంటాడో అని భయపడుతున్నాడు. వాడు తన ఏకైక సంతానం. ఆ వీధిలోని వాళ్ళు "మనవాడు మాంఛి బహద్దూర్. పోట్లగిత్త ఆటపట్టించాడు చూశారుకదా!" అన్నారు.

అతను నిశ్శబ్దంగా వుండిపోయాడు. ఆరోజు కూడా వీధి జనాలు ఇంటిదగ్గర ఇలాగే పోగయ్యారు. తన కొడుకు సహపాఠి అయిన అమ్మాయి అల్కా "అంకుల్! భలే తమాషా జరిగిపోయింది. మీరేమీ అడక్కండి. మీ అబ్బాయి దాని పొగరు అణిచిపారేశాడు" అంది.

అతడు అప్పుడేమీ అనలేదుగాని రాత్రి భోజనాలవేళ "నువ్వు ఆ ఎద్దుతో తలపడ్డావు. ఒకవేళ నీకేమైనా అవుతే ఎలా వుండేదిరా?" అన్నాడు.

"అయితే ఏంనాన్నా? ఏమీ కాదులే. నేను మీ కొడుకుని కదా నాన్నా! పులిబిడ్డ పులిబిడ్డే! నిజమేకదూ?"

అతనికి వాడు మాటలతో 'మస్కా' కొడుతున్నాడని తెలుసు. కొడుకు ముఖకవళికల్ని మౌనంగా పరిశీలించసాగాడు.

కొడుకు సీనియర్ సెకండరీ పరీక్షల కోసం చదువుతున్నాడు. చదువులో చాలా చురుకైనవాడు.

"నాన్నా! ఇవాళ మీరు విస్కీ తీసుకోనట్లుంది. భోజనాలకేం తొందర్లేదు. మరో ఇరవై నిముషాల తర్వాత చేద్దాం. ముందు కాస్త మందు తీసుకోండి. అరే కాస్త ఎంజాయ్ చేయండి నాన్నా!"

** ** **

ఇదంతా గుర్తుకొచ్చి అతని కళ్ళు సజలాలయ్యాయి. అందరి కళ్ళూ అతనిపైనే వున్నాయి. అతడు కాస్త తేరుకుని లేచి బాత్రూములోకి వెళ్ళాడు. అరచేతుల్లో మొహం దాచుకుని వెక్కివెక్కి ఏడ్చాడు. నవ యువకుడైన తన కొడుకు శవపేటికలో బంధించబడి వాకిట్లో పడివున్నాడు. చచ్చిన తన కొడుకు గురించి ఆత్మీయంగా రెండు కన్నీటిబొట్లు రాల్చలేకపోతున్నాడు. శవపేటికలోని మృతశరీరాన్ని హృదయానికి హత్తుకొని గుండె తేలికపడేదాకా ఏడవాలనుకున్నాడు. అంతమందిలో అది సాధ్యంకావడం లేదు. వాళ్ళంతా "మీ కొడుకు దేవుని దగ్గరకు వెళ్ళాడు. వీరుడు దైవంతో సమానం. నక్షత్రాల్లో నక్షత్రంగా మారాడు" అంటున్నారు. మోకాళ్ళ మధ్య తల దూర్చి మళ్ళీమళ్ళీ రోదించాడు. ఎవరో తలుపు తట్టినట్లనిపించింది. అతను తక్షణం లేచి వాష్‌బేసిన్‌ను సమీపించి ముఖం కడుక్కున్నాడు. కళ్ళమీద నీళ్ళు చల్లుకున్నాడు. తన్నుతాను సంభాళించుకుంటూ కళ్ళు తుడుచుకుని బయటికొచ్చాడు.

ఓ పొరుగింటి పిల్లవాడు తలుపు తడుతున్నాడు. వాడు "అంకుల్! అందరూ మీ గురించి ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా వచ్చారు" అన్నాడు.

అతడు మళ్ళీ వాకిట్లోకి వచ్చాడు. తళతళా మెరిసిపోతున్న తెల్లని దుస్తుల్లో వున్న ముఖ్యమంత్రిగారికి శర్మగారొచ్చారని ఎవరో చెప్పారు. ముఖ్యమంత్రి చుట్టూ నల్లని దుస్తుల్లో కమెండోలు నించుని వున్నారు. అతడు ముఖ్యమంత్రికి చేతులు జోడించి నమస్కరించాడు.

"శర్మాజీ! ఇవాళ దేశం యావత్తూ మిమ్మల్ని చూసి గర్వపడుతోంది. ప్రాణాలను పణంగా పెట్టి కడదాకా వీరోచితంగా పోరాడిన మీ అబ్బాయి వెనక దేశమంతా నిలబడివుంది. శత్రువు తోక జాడిస్తున్నాడు. మీ కొడుకంటే నాకు గర్వంగానూ, గౌరవంగానూ వుంది"

అతడు మౌనంగా నిలబడి ముఖ్యమంత్రి ముఖాన్ని పరిశీలించసాగాడు. అతడు ఇప్పటిదాకా తన భార్య సంగతే మరిచిపోయాడు. ఆమె ఎక్కడుంది, ఎలావుందని కూడా ఆలోచించలేదు. వెంటనే ఆమె దగ్గరకు వెళ్ళి "ఎలా రాసిపెట్టివుంటే, అలా జరుగుతుంది అంతా దైవేచ్ఛ" అని ఓదార్చాలనుకున్నాడు. ఏదిఏమైనా తమ కొడుకు స్వార్థపరుడు. తన సాహసోపేత కార్యాలతో యావద్దేశాన్ని పులకింపచేసి తల్లిదండ్రుల్ని మాత్రం అర్థాంతరంగా వదిలి వెళ్ళాడు. ఇదీ దైవేచ్ఛేనేమో! నిజానికి వాడు ఆ పోట్లగిత్త వ్యవహారం రోజునే అయిపోయాడనుకున్నాం.

** ** **

"ఏం ఆలోచిస్తున్నారు? తీసుకోండి! టీ తాగండి" భార్య అతని భుజాలు కుదుపుతూ కప్పు అతని ముందు పెట్టింది. వాస్తవానికి అతడిప్పటిదాకా ఒకనెల కిందట జరిగిన సంఘటనల్లో కూరుకొని వున్నాడు. భార్య కళ్ళల్లోకి చాలాదూరం చూశాడు. అవి ఖాళీగా వున్నాయి... శూన్యంగా, నిర్వికారంగా వున్నాయి. అతడు టీకప్పు చేతిలోకి తీసుకున్నాడు. ఆమె "ఏమాలోచిస్తున్నారు? నాకేమీ అర్థం కావడంలేదు" అంది. అతడు దీర్ఘంగా నిట్టూర్చి టీ కప్పును బల్లమీద వుంచాడు.

** ** **

"ఏమాలోచిస్తున్నారు నాన్నా? మీరెక్కువగా ఆలోచించకండి. సంతోషంగా వుండండి. మిమ్మల్ని ఎప్పుడో ఒరోజు ఆఫీసర్స్ మెస్‌కు తీసికెళ్ళి విస్కీ తాగిస్తాను" అన్న కొడుకు మాటలు గుర్తుకొచ్చాయి.

## మూడు చెరువుల నీళ్ళు

పందెంలో "ఓడితే" మూడు చెరువుల నీళ్ళు తాగుతానని ఆ రామారావుతో సవాల్ విసిరి చివరికి ఓడిపోయావటగా!!

ఇంతకీ అన్ని నీళ్ళెలా తాగావ్?! తాగి ఎలా బతికి బైటపడ్డావు?

మూడు చెరువుల్లో నీళ్ళు "మూడు చెంబుల్లో" ముంచుకుని తాగేసి!!

**– యు. చిట్టిబాబు,**
**కొత్తగూడెం, ఖమ్మంజిల్లా**

"నాన్నా! నాకు ఎన్.డి.ఏ.లో సెలెక్షన్ వచ్చింది. ఇదుగో ఎంప్లాయిమెంట్ న్యూస్. రిజల్ట్స్ వచ్చాయి" అన్నాడు అతని మెడలకు వేలాడుతూ.

అతడు ఈ విషయం విని భయకంపితుడయ్యాడు. ఆ తర్వాత మూడేళ్ళకి భార్యతో కలిసి డెహ్రాడూన్ వెళ్ళి తన కొడుకు పాసింగ్ అవుట్ పెరేడ్‌లో పాల్గొనడం చూశాడు. ఎంతగానో సంతోషించాడు. తల్లిదండ్రులకు అంతకన్న కావల్సిందేముందని ఆనంద డోలికల్లో వూగిపోయాడు. ఇప్పుడతను ఓ సైనికాధికారికి తండ్రి.

అతడలా డెహ్రాడూన్ నుండి ఇంటికి తిరిగొచ్చాడో లేదో సరిహద్దుల్లో యుద్ధం మొదలైంది. మరికొన్నాళ్ళకు... వీరుడైన తన కుమారుడు కున్వర్ కోమలేంద్ర్ సింగ్ రక్తసిక్త శరీరాన్ని కొంతమంది సైనికులు మోసుకొని ఇంటికి తీసుకొచ్చారు.

ఆఫీసర్స్ మెస్‌కు తీసుకెళ్ళి తనకు విస్కీ తాగిస్తానని వాగ్దానం చేసిన తన కొడుకు ఇలా ఎకాయెకి తమను నట్టనడి ఏటి పట్టులో వదిలిపోతాడని కలలో కూడా అనుకోలేదు.

అతడు సొరుగులోంచి యుద్ధరంగం నుండి కొడుకు రాసిన వుత్తరం తీసి చదవసాగాడు.

రాజ్‌పుతానా రైఫిల్స్ - రెండు
పన్నెండు జులై తొంభైతొమ్మిది
మైడియర్ నాన్నా!

బావున్నారా? నాగురించి బెంగపెట్టుకోలేదుకదా! ప్లీజ్ నాన్నా! పులిబిడ్డ పులిబిడ్డే!! లక్ష్యాన్ని ఛేదించే దిశలో ముందుకు సాగుతున్నాం. మా యూనిట్‌ను పొగడుతూ చీఫ్‌ఆఫ్ ఆర్మీ యూనిట్ ఓ అప్రిసియేషన్ లెటర్ పంపింది. ఇట్స్ ఎ గ్రేట్ హానర్ నాన్నా! మీక్కూడా కృతజ్ఞతలు. మీరు నన్నాశీర్వదించాలి. మా యూనిట్‌కు లభించిన ప్రశంస చాలా అరుదైంది. దేశంకోసం యుద్ధరంగంలోకి వురకడం, సన్మానాలు పొందడం గర్వించదగ్గవి. మీకూ గర్వకారణం"

కొడుకు రాసిన మొదటి వుత్తరం తీశాడు. అందులో "నాన్నా! ఈ పాలక వర్గాలు దేశాన్ని యుద్ధంవైపు నెట్టుతున్నాయనిపిస్తోంది. విచారించకండి. యుద్ధమంటూ జరిగితే మేమే గెలుస్తాం. వీడు పులిబిడ్డ" అని రాసివుంది.

"నేను మీకు టీ ఇచ్చి వెళ్ళాను. తాగారా, లేదా?" అన్న భార్య పిలుపు మళ్ళీ విన్పించింది.

"టీ చల్లబడిపోయింది" సిప్ చేస్తూ అన్యమనస్కంగా అన్నాడు. ఆమె కాసేపు అతనివద్ద నుంచుని "రోజంతా అలా ఫోటోముందు కూచుని ఆలోచిస్తే వాడు తిరిగొస్తాడా?" అనబోయిందిగాని ఆమె కంఠం రుద్ధమై మాటలు రాలేదు.

అతడు భార్యవైపు తలెత్తి చూసే సాహసం చేయలేకపోయాడు. గొణిగినట్లుగా "కాదు, అదేంకాదు. కానీ వాడు ఆ మిలిటరీ యూనిఫామ్‌లో దిగిన ఫోటోను చూస్తుంటే వాడెక్కడికీ వెళ్ళలేదనిపిస్తోంది. వాడిక్కడే తచ్చాడుతూ మనతో ముచ్చటిస్తున్నటుగా వుంది..." ఇంక మాట్లాడలేకపోయాడు. దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. భార్యకూడా ఏమీ మాట్లాడలేదు. ఆమె చల్లారిపోయిన టీ కప్పును తీసుకొని వేడిచేసేందుకు వెళ్ళిపోయింది.

ఇంతకుముందెప్పుడూ ఆమె చల్లబడిపోయిన టీని వేడిచేసి ఎరగదు. ఆ టీని వాష్‌బేసిన్‌లో పారబోసి మళ్ళీ తాజాగా టీ పెట్టి ఇచ్చేది! ఈసారి ఎందుకో అలా చేయలేకపోయింది. మాటిమాటికీ టీ కాచి ఇచ్చే శక్తి తనలో లోపిస్తున్నట్లు అన్పించిందామెకు.

అతడేమో తన చదువులో లీనమవుతాడు. ఆమె టేబుల్ మీద టీ పెట్టి వంటింట్లోకి వెళ్ళిపోతుంది. అతడు చదువులో పడిపోయి టీ తాగడం మరిచిపోతాడు.

అతడు కొడుకు రాసిన మరో ఉత్తరం తీశాడు. అది వాడు ట్రెయినింగ్ చేస్తున్నప్పటి వుత్తరం.

".... ఇట్స్ ఎ గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ నాన్నా! అరబ్బు జాతి మేలు గుర్రాన్ని "సూపర్‌ఫాస్ట్" వేగంతో దౌడు తీయిస్తున్నట్లు ఇక్కడ ఒక్క క్షణం కూడా తీరికుండదు. తెల్లారి లేవడం తరువాయి పరుగు. ఐదున్నరకు బెడ్ టీ. మరో పావుగంటకు డ్రిల్, పీటీ. తర్వాత రోజు రోజంతా ఒకదాని తర్వాత మరొక పని. రాత్రి పదింటికి లైట్లు ఆర్పుతారు, మీకు ఉత్తరాలు కూడా చాలాసార్లు వెన్నెల్లో కూచుని రాయాల్సివచ్చేది. గత శుక్రవారంనాడు క్రాస్ కంట్రీరేస్ జరిగింది. నేనందరి కన్నముందు పరుగెత్తాను. చాలా హాయిగా పరుగెత్తాను. చివరి నిముషంలో మాధవన్ అనేవాడు వేగం పెంచి నన్ను దాటిపోయాడు. ఆఖరు పాయింటు చేరుకుని స్పృహతప్పి పడిపోయాడు. ఆ క్రితం రోజు అతనికి జ్వరమట! రాత్రంతా జ్వరంతో తల్లడిల్లుతూనే పొద్దుట పరుగుకు సిద్ధమయ్యాడు. గెలిచాడు. నేను కాస్త వేగం పెంచి వున్నట్లయితే ఫస్ట్ వచ్చేవాణ్ణి! మాధవన్ అమీతుమీ తేల్చుకోవాలని పరుగెత్తినట్లున్నాడు. నేనెందుకు 'కిల్లింగ్ ఇన్‌స్టింక్ట్' చూపి గెలవలేకపోయానా అని బాధగావుంది. అయామ్ సారీ! ఇకముందు అలా జరగదు. మీ బిడ్డ ఇకముందు రెండోస్థానంలో వుండడుగాక వుండడు"

** ** **

మళ్ళీ అతని ఆలోచనలు నెలకిందట తన ఇంటిముందు గుమికూడిన జనమ్మీదికి మరలాయి.

"మా సాహెబ్ చాలా సాహసవంతుడు సార్" కొడుకు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చిన బటాలియన్‌లోని జూనియర్ ఆఫీసర్ అంటున్నాడు.

"మా అందరికన్నా ముందుండేవాడు. అందరికన్న ముందు దాడిచేసేవాడు. శత్రుపటాలం మా ప్లటూన్ ఎల్.ఎమ్.జీ.ని టార్గెట్‌గా పెట్టుకునేలోపు మీవాడు అది గమనించి కొదమసింగంలా లంఘించాడు. వాళ్ళని మట్టి కరిపించాడు. అంతేకాదు మమ్మల్నందరినీ కాపాడాడు. కానీ చనిపోయాడు. విజయవం మనదైంది. మేమతని స్వప్నాన్ని నిజం చేశాం. అతను కడశ్వాస వదలేదాకా పర్వతాగ్రం మీద త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించాం. అతడు మన జెండా రెపరెపలాడ్డం చూసి హాయిగా కళ్ళుమూశాడు"

** ** **

భార్య మళ్ళీ బల్లమీద టీ పెట్టింది. అతనికి కొడుకుతోపాటు చదివిన అమ్మాయి అల్కా గుర్తుకొచ్చింది. ఆమె తన కొడుక్కి సహపాఠి మాత్రమేకాదు. మంచి స్నేహితురాలు. అంతేకాదు తన కొడుకు లెఫ్టినెంటు కున్వర్ కోమలేంద్ర సింగ్‌తో వివాహ నిశ్చితార్థం జరిగిపోయిన పిల్ల. అవును... అతను స్వయానా తన కొడుక్కోసం పిల్లల్ని చూస్తున్నాననేవాడు. కొడుకు పెళ్ళి అల్కాతోనే జరపాలనుకున్నాడు. ఈసారి సెలవులకని రాగానే వాణ్ణి ఓ యింటివాణ్ణి చేయాలనుకున్నాడు.


అల్కా శవపేటికను తన బాహుల్లోకి తీసుకోవాలని చూస్తోంది. వలవలా దుఃఖిస్తోంది. కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. సైనికులు ఆమెకు ఊరట చెబుతున్నారు. శవపేటిక నుండి ఆమెను దూరం తీసుకుపోవడానికి విఫల ప్రయత్నం చేస్తున్నారు.

అతడు దూరంగా నించుని ఈ తతంగమంతా చూస్తున్నాడు. బొటబొట కన్నీరు విడుస్తున్నాడు.

ముఖ్యమంత్రి అల్కా తలమీద చేతులువేసి "బిడ్డా! నువ్వు సౌభాగ్యవతివి. దేశరక్షణ కోసం పోరాడి అసువులు బాసిన వీరుడు నీకు వరుడు" అన్నాడు.

"మరి... మీరెందుకు మీ బిడ్డల్ని దేశం కోసం సరిహద్దుల మీదికి పంపించరు? మీ కొడుకులెందుకు గుండెనెత్తురులు తర్పణ చేయరు? మీ సంతానం దేశరక్షణ కోసం ఆత్మబలిదానం చెయ్యవలసిన అవసరంలేదా? మీ పిల్లలు అమరవీరులు కానక్కరలేదూ..." అంటున్న అల్కా ముఖ్యమంత్రి కాలర్‌ను వీరకాళిలాగా పట్టుకుని గట్టిగా అరుస్తూ స్పృహతప్పి పడిపోయింది.

అతని కళ్ళల్లోంచి జలజలా అశ్రువులు రాలాయి. బల్లమీద పెట్టిన టీ మళ్ళీ చలబడుతోంది.




## దగ్గు

రమేష్: డాక్టర్! వారం నుండి ఒకటే దగ్గు నేనే వినలేక చస్తున్నాననుకోండి!!

డాక్టర్: "ఐతే ఇదిగో! ఇవి చెవిలో పెట్టుకోండి!!"

రమేష్: "దగ్గు తగ్గుతుందా?"

డాక్టర్: "దగ్గు తగ్గడం తెలీదుకానీ మీకు వినే బాధ తప్పుతుంది!"

**తిరుపతి కిరణ్, తిరుపతి**

## కరీనా రాజసం కథా కమామీషూ!

**బాలీవుడ్‌లో** కపూర్ కుటుంబపు పేరును సక్రమంగా వినియోగిస్తున్నారో, దుర్వినియోగం చేస్తున్నారో కానీ ఆ కుటుంబం పేరు ప్రస్తావించకుండా మాత్రం ఎప్పుడూ ఉండరు. ఇటీవల ఓ షూటింగ్ లో కరీనా కపూర్ తాగడానికి నీళ్ళు కావాలంది. అమ్మగారు అడిగిందే తడువుగా ప్రొడ్యూసర్ రాజభక్తితో గ్లాసు అందించాడు. కరీనా తాగబోయేంతలో తల్లి వచ్చి మంత్రి రాజుని విషప్రయోగం నుండి రక్షిస్తున్నంత నేర్పుగా గ్లాసు లాక్కొని రాజద్రోహి ముఖాన కొట్టింది. కారణమేమిటనుకుంటున్నారు? ఆ గ్లాసులో ఉంది మామూలు మంచినీళ్ళట. రాజ్ కపూర్ మనవరాలు కరీనా బిస్లరీ నీళ్ళు తప్ప ఇంకేదీ ముట్టదట. పాపం మంచినీళ్ళకి ఈ కుటుంబపు రాజసం తెలియదాయె!

